నాయనా! లేకున్న నీవటకే యీగంగలో మునింగియుండనా? తండ్రీ! అటువంటి జీవితేశ్వరు నెడఁబాసి యింకను మొండినై జీవింపవలెనా?

చ॥ అంతటి కాఁపురంబునకు ♦ నాఁడిదియై, సడిమోసి, మానినీ
ధ్వాంతము పొంతకేఁ దగుచు ♦ నం చెటు పోవుదు; నీవనాంతమం
దంతటిదాననై రఘుకు ♦ లాంకుర మేర్పడ నంతదాక నీ
వంతభరించి, యింత బల ♦ వంతము మై తరియింతు జన్మముల్॥

వాల్మీ—బిడ్డా! నీవు కంటనీరిడిన నేఁ జూడఁ జాలను — దుఃఖింపకుము — ఈ నిందకుంగల కారణార్థము వేఱు

ఉ॥ పుట్టువు తోడనే పరమ ♦ పుణ్యవు నీవయి నేటికెట్లో యీ
పుట్టిననింద యేమరిత ♦ ముల్ బొనరింపఁగ లేముగాని నా,
పుట్టువు మంచిదై, జనక ♦ భూపతి పోలిక, నిన్ను నేను నా
పట్టిగ నెంచి, పెంచికొను ♦ భాగ్యము నాకు ఘటించె జానకీ!॥

తల్లీ! నీపాతివ్రత్య మెఱుంగనివారు లేరు. నిన్నెవ్వరో శంకింతురను భయ మక్కఱలేదు. నీయుపచారమునకై నేను నియమించు నొకరిరువురు దివ్యపురంధ్రులకుఁ దక్క నన్యులకు నీ వదృశ్యవైయుండునట్లు నీకు వరమిచ్చితిని రమ్మని.

సీత—తండ్రీ! ఇంక నిర్భయముగ నీకడఁపున దాఁగియుండెదను.

వాల్మీ—బిడ్డా! నీవు పెఱచోటికెక్కడికో రాలేదు రమ్ము నీపుట్టినింటికే; పరమేశ్వరుఁడు నిన్నుఁ జేర్పవలసిన చోటికే చేర్చినాఁడు.

ఉ॥ ఈ మునిపల్లెయే మిథిల, ♦ యే జనకుండఁ, దపస్వినీజనం
బే సుదినమ్ము బాంధవ, మిఁ ♦ కేటికొఱంత, పశుంతు లెందురా
రా మునుగానుపుం బుఱటి ♦ కై, తమ పుట్టినయిండ్లకుల్? కుమా
రీ! మిథిలేశ్వరుం డొకఁడు ♦ నే నొకఁడా? నినుఁ గూర్మిఁ బెంపఁగన్॥

సీత—నాయనా! అట్లెన్నఁడుఁ దలంపను. ఆ జనకుఁడు నన్ను నాసంతోషకాలమునఁ బెంచెను. నీవో నాయాపత్కాలమునఁ గడుపున నిడికొని పెంచఁ బోవనున్నావు. ఆజనకునికన్న నీజనకుఁడే నాకు మిన్నయనుకొన్నను దోషముగాదు.

